నిస్వార్థ సేవల నిలయం మాస్టర్ ఇ.కె సంస్కృతి సదన్

తాటిచెట్లపాలెం : భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, సంప్రదాయ పరిరక్షణకు మాస్టర్ ఇ.కె. జీవితం ఓ సంకేతమని, మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్ నిస్వార్థ సేవలకు నిలయమని పలువురు విదేశీయులు ప్రశంసించారు. వివిధ దేశాలకు చెందిన జగద్గురు పీఠం ప్రతినిదులు మంగళవారం తాటిచెట్లపాలెంలో గల మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌ను సందర్శించారు. ప్రాంగణంలో నిర్వహించిన ఉత్సవ సభలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగద్గురుపీఠం ఐరోపా ఖండం కో ఆర్డినేటర్ లుడ్జర్ మాట్లాడుతూ మాస్టర్ ఇ.కె.ప్రభోదాలు, ఆయన రచించిన గ్రంథాలు పాశ్చాత్యులకు మార్గదర్శకంగా నిలిచాయన్నారు. స్పెయిన్ దేశస్థురాలు డోర్లే మాట్లాడుతూ మాస్టర్ ఇ.కె.రచనలు విదేశీ భాషల్లోకి అనువదించారన్నారు. జర్మనీ సాధకురాలు కరీనా మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలను పాటించడం వల్ల వేద సూక్తులు, స్తోత్రాలను నేర్చుకున్నానని, వాటితో తానెంతో ప్రయోజనం పొందుతున్నానని తెలిపారు. జగద్గురుపీఠం నిర్వహించే గురుపూజలు తమకు స్ఫూర్తిని కలిగిస్తుంటాయని మైఖేల్ అనే విదేశీయుడు తెలిపారు.

జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ మాస్టర్ పార్వతీకుమార్ ప్రతిపాదించిన సేవా కార్యక్రమాలను గత 25 సంవత్సరాలుగా నిర్విరామంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వృత్తి విద్యలలో శిక్షణ పొంది, ఉత్తీర్ణత సాధించిన మహిళలకు మంగళవారం విదేశీయుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురుప్రసాద్, సర్కిల్ ఆఫ్ గుడ్‌విల్ కార్యదర్శి బీఆర్‌కే రాజు, సంస్థ కార్యనిర్వాహక సభ్యులు బి.ఉషారాణి, మహిళా కేంద్రం నిర్వాహకురాలు దాట్ల రాధ పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న మహిళలతో విదేశీయుల బృందం

వైద్య సేవల్లో ఆశ కార్యకర్తలు కీలకం

సీతంపేట : సీజనల్ వ్యాధులు అదుపు చేయడంలో క్షేత్ర స్థాయిలో ఆశ కార్యకర్తల సేవలు కీలకమని జిల్లా మలేరియా నివారణ విభాగం ఎంపీహెచ్ఈవో శేషుబాబు అన్నారు. నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులను వ్యాప్తి చేసే దోమల నియంత్రణకు మంగళవారం, శుక్రవారం, శనివారం ఫ్రై డే డ్రై డే పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించాలని సూచించారు. నిల్వ నీటిలో దోమ లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తిస్తే ఆ నీటిని పారబోయించాలని తెలిపారు. దోమల వృద్ధిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యులు మనోజ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు అర్హులందరికీ చేరేలా ఆశ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. వ్యాక్సినేషన్, ఫ్రై డే డ్రై డే, కమ్యూనికబుల్ డిసీజెస్ నియంత్రణలో ఆశ కార్యకర్తలు ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్ నాగ సతీష్, హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈవో శేషుబాబు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్స్ వద్దు

సీతంపేట : పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులు విడనాడి గుడ్డ సంచులు, పేపర్ బ్యాగ్స్ వాడాలని జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వి.వి.లక్ష్మీనారాయణ సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై నరసింహనగర్ రైతుబజార్‌లో జీవీఎంసీ సిబ్బందితో కలిసి వినియోగదారులకు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు భూమిలో కలవడానికి వందేళ్లకు పైగా సమయం పడుతుందని, పైగా భూమి, నీరు కలుషితం అవుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు, భావితరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఇచ్చేలా ప్రతి ఒక్కరూ గుడ్డ, నార, కాగితం సంచులు వాడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ సంచితో బజార్‌కు వచ్చిన వినియోగదారులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. విశాఖ నగర పరిధిలో ప్లాస్టిక్ నియంత్రణలో జీవీఎంసీకి ఫౌండేషన్ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను, బజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ, జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నరసింహనగర్ రైతుబజార్‌లో గుడ్డ సంచులు అందజేస్తున్న వీవీ లక్ష్మీనారాయణ

కేయ హత్కార్‌కు ఘన సత్కారం

సీతంపేట : విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం - 2025 అవార్డు గ్రహీత కేయ హత్కార్ (ముంబాయి) సత్కార సభ ఘనంగా నిర్వహించారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన జరిగిన సభలో విశ్రాంత ఏఎస్పీ ఎస్.దివాకర్ చేతుల మీదుగా కేయను సత్కరించి జ్ఞాపిక, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది నెలల వయస్సులో సంభవించిన స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) కారణంగా కేయ హత్కార్ నడవలేని పరిస్థితిలో వీల్ ఛైర్‌కే పరిమితమైందన్నారు. అయినప్పటికీ తన పరిస్థితికి దిగులు చెందకుడా ఛాలెంజింగ్‌గా తీసుకుని మోటివేషనల్ స్పీకర్‌గా, రైటర్‌గా, యూట్యూబర్‌గా, ఆర్టిస్ట్‌గా రాణించి ఎందరో పిల్లలను చైతన్యవంతులను చేశారన్నారు. డ్యాన్సింగ్ ఆన్ ద వీల్స్, ఐ యామ్ పోజిబుల్, హౌ టు రైట్ ఏ బుక్ రచించి, అత్యధిక బుక్ సెల్లింగ్ ఆథర్‌గా గుర్తింపు పొందడం విశేషమన్నారు. కేయ ప్రతిభను తెలుసుకున్న ప్రధాని మోదీ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం - 2025 అవార్డు ప్రకటించారని తెలిపారు. డిసెంబర్ 26న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నారని తెలిపారు. కేయ రచనలను అన్ని భాషల్లోకి అనువదించాలని ప్రధాని ఆదేశించారన్నారు. ప్రొఫెసర్లు పి.సుబ్రహ్మణ్యం, విష్ణుష్, గోపాల్, పాపాహోం విద్యార్థులు పాల్గొన్నారు.



కేయ హత్కార్‌ను సత్కరిస్తున్న దివాకర్, రఘురామారావు తదితరులు

మరమ్మతు పనులకు శంకుస్థాపన



కొబ్బరికాయ కొడుతున్న శ్యామల దీపిక

మర్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డులో మరమ్మతు పనులు చేపట్టేందుకు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలతో వార్డులోని మహత్‌కాలనీలో మెట్లు, డ్రెయిన్లకు మరమ్మతులు చేపట్టనున్నారు. అనంతరం సమీపంలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కాసేపు చిన్నారులతో ముచ్చటించారు. కేంద్రంలో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. ప్రీ స్కూల్ అటెండెన్స్ విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మవతి, పైడి ప్రతాప్, రాణి, రత్నం, సారిక, శ్యామ్‌తోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యాపార, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి

నగరంలో కీలకంగా మారిన విశాఖ ఉత్తర నియోజకవర్గం



సీతంపేట : విశాఖ ఉత్తర నియోజకవర్గం జిల్లాలో ప్రత్యేకతను సంతరించుకుంది. భౌగోళికంగా చిన్నది కావడం, నియోజకవర్గంలోని 17 వార్డులు జాతీయ రహదారికి ఇరువైపులా విస్తరించి ఉండటం, నగర నడి బొడ్డులో నియోజకవర్గం అంతా కేంద్రీకృతమై ఉండటం దీని ప్రత్యేకత. రామాటాకీస్ రోడ్ సత్యం సెంటర్ నుంచి, ఆర్ అండ్ బీ జంక్షన్ వరకు హైవేకు ఇరువైపులా నియోజకవర్గం విస్తరించి ఉంది. సహజ సిద్ధమైన కొండలకు ఆనుకుని ఉన్న నియోజకవర్గంలో సీతమ్మధార, సీతంపేట, అక్కయ్యపాలెం, నరసింహనగర్, మురళీనగర్, మాధవధార, కంచరపాలెం, మర్రిపాలెం ప్రాంతాలు వ్యాపార వాణిజ్య పరంగా ఎంతో అభివృద్ధి చెందాయి. నియోజకవర్గంలో బహుళ అంతస్తుల నిర్మాణ రంగంతోపాటు, హోటల్స్, ఫుడ్ పాయింట్స్, స్టీల్, ప్లైవుడ్, సిమెంట్, ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్స్ వ్యాపారాలు, స్కూల్స్, కళాశాలలు, షాపింగ్ మాల్స్‌తో నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. మాధవధారలో కొండపై 1270లో వెలసిన మాధవస్వామి ఆలయం, ఇక్కడ జలధారలు వద్ద మాధవుడు కొలువై ఉన్నారు. కప్పరాడ ఎన్‌జీజీవీస్ కాలనీలో వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం, సీతమ్మధార నుంచి మాధవధార వరకు గిరిప్రదక్షిణ మార్గం, పోర్టు స్టేడియం, పోర్టు ఆస్పత్రి, గురుద్వారా సిక్కు ప్రార్థనా మందిరం, 75 ఏళ్ల కిందట వెలసిన శ్రీలలితాపీఠం, మారియట్ హోటల్, మురళీనగర్, మాధవధారలో పదుల సంఖ్యలో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, హైవేకు ఇరువైపులా పచ్చని గ్రీన్‌బెల్ట్, వాకింగ్ ట్రాక్‌లు, కొండవాలు ప్రాంతాల్లో నివాసాలు, సీతమ్మధారలోని స్నిపర్ పార్కు ప్రత్యేక ఆకరక్షణగా నిలుస్తున్నాయి. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన ఇనార్బిట్‌మాల్ కైలాసపురం రోడ్‌లో నిర్మిస్తున్నారు. 16 ఎకరాల విస్తీర్ణంలో రూ.600 కోట్లతో రహేజా గ్రూప్ నిర్మిస్తున్న ఈ మాల్ అందుబాటులోకి వస్తే వ్యాపార, వాణిజ్య పరంగా దక్షిణ భారతదేశంలోనే ఉత్తర నియోజకవర్గం ప్రత్యేకతను సంతరించుకుంటుంది.

స్పీచ్ అండ్ హియరింగ్‌లో ఎక్స్‌పర్ట్



వినికిడి లోపంతో ఇబ్బంది పడుతున్న వారికి గాయత్రి స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్‌లో అత్యాధునిక టెక్నాలజీతో పూర్తి స్థాయిలో వినిపించేలా సేవలందిస్తున్నాం. నగరంలో గురుద్వారా కూడలి వద్ద, విజయనగరంలో ఫెడరల్ బ్యాంకు వద్ద ఉన్న క్లినిక్‌లో సేవలందిస్తున్నాం. ప్రస్తుతం వాడుతున్న చెవి మిషన్ వల్ల సంతృప్తి లేకపోయినా, టీవీ, మొబైల్ ఫోన్ సౌండ్, రద్దీ ప్రదేశాల్లో సరిగ్గా వినిపించకపోయినా లేటెస్ట్ టెక్నాలజీతో వినిపించేట్టు చేస్తున్నాం. బ్లూటూత్ టెక్నాలజీ, రీఛార్జిబుల్ టెక్నాలజీ, వాటర్ ప్రూఫ్, చెవిలో కనిపించని చిన్న మిషన్స్ ద్వారా పూర్తి స్థాయిలో వినికిడి శక్తి కల్పించడం మా ప్రత్యేకత. హియరింగ్ పరీక్షలు, హియరింగ్ పరికరాలు, టిన్నిటస్ మేనేజ్‌మెంట్, వెర్టిగో ఎవల్యూషన్, కోచ్‌లియర్ ఇంప్లాంట్స్, హియరింగ్ ఎయిడ్స్ రిపేర్స్, సర్వీసింగ్, స్పేర్ పార్టులు, స్పీచ్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవిరియల్ థెరపీ సేవలందిస్తున్నాం.

– వి.సంపత్‌కుమార్, ఆడియోలజీ, గురుద్వారా

జేఎస్ఆర్‌లో ఆఫర్లకు విశేష ఆదరణ

సీతంపేట : జగదాంబ జంక్షన్‌లోని జేఎస్ఆర్ షాపింగ్‌మాల్‌లో ఆఫర్లకు విశేష ఆదరణ లభిస్తోంది. సంక్రాంతి పండగ సందర్భంగా అన్ని వస్త్రాలపై 70 శాతం వరకు డిస్కౌంట్ లభిస్తోంది. మెగా సేల్‌లో భాగంగా ఆధునిక, సంప్రదాయ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. ఫ్యాన్సీ, డిజైన్, సిల్క్, బెనారస్ చీరలు, చుడీదార్స్, డ్రెస్ మెటీరియల్, కుర్తీస్, లెహంగాస్, గాగ్రాస్, కిడ్స్, వెస్టన్ వేర్ దుస్తులు షోరూంలో ఆకట్టుకుంటున్నాయి. కుర్తీస్ రూ.99ల నుంచి మొదలు కానుండగా, చీరలు రూ.149 నుంచి ధరల్లో లభిస్తున్నాయి. వెస్టన్ వేర్ రూ.249ల నుంచి లభిస్తాయని షోరూం మేనేజర్ వేగి జగదీష్ కుమార్ తెలిపారు.



పక్షులను, పర్యావరణాన్ని కాపాడుదాం



పక్షులను కాపాడి పర్యావరణ సమతుల్యానికి బాటలు వేద్దాం. ఈ మేరకు సత్వా నేచురల్స్ స్టోర్‌కు వచ్చే వినియోగదారులకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకొస్తున్నాం. సెల్‌ఫోన్ టవర్స్ రేడియేషన్ వల్ల పక్షుల మనుగడకు ముప్పు ఏర్పడింది. అలాగే క్రిమి సంహారక మందులతో పంటలు పండించడంతో ఆ ఆహార గింజలు తిని చిన్నచిన్న కీటకాలు, పక్షులు మృత్యువాత పడుతున్నాయి. నగరీకరణలో భాగంగా చెట్లు నరికి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడంతో పక్షుల గూళ్లు కట్టుకునే నివాస పరిస్థితులు తగ్గిపోయాయి. పక్షులు తమ జీవనాన్ని కొనసాగించే వాతావరణాన్ని కల్పించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. పక్షులకు ఆహారం, నీరు అందించి, ఇంటి ఆవరణలో వరి కంకులు, గూళ్లు అమర్చి పక్షులకు నివాసాన్ని కల్పించాలి. అంతరించిపోతున్న పిచ్చుకలు, పావురాలు, రామ చిలుకలు ఇతర పక్షులను కాపాడుకునేలా సత్వా నేచురల్స్ కృషి చేస్తోంది. రైతుల నుంచి వరి కంకులు సేకరించి అదే ధరకు తమ స్టోర్‌కు వచ్చే కస్టమర్లకు అందించి ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నాం. – వి.లక్ష్మీ తేజ, సత్వా నేచురల్స్, సీతమ్మధార.

జీవనశైలి మార్పుల వల్లే క్యాన్సర్

మహారాణిపేట : జీవన శైలిలో వచ్చిన మార్పులు వల్లే క్యాన్సర్ విజృంభిస్తోంది. కాలుష్య ప్రభావం, అలవాట్లు, వ్యసనాలు, జీవన శైలి, ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యం వల్ల రోజురోజుకూ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. ప్రకృతి పరంగా దొరికే ఆహారం లేకపోవడం, అర్బన్‌లో ఎక్కువగా జంక్‌ఫుడ్‌కు అలవాటు పడుతుండడంతో పురుషులు, స్త్రీలు అన్న తేడా లేకుండా అందరూ క్యాన్సర్‌కు గురవుతున్నారు. స్త్రీలలో ఎక్కువగా రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బాధితులు పురుషులు కన్నా ఎక్కువగా ఉన్నారు. తగినంత వ్యాయమం లేకపోవడం, పొగాకు వినియోగం, ఖైనీ, ఆల్కహాల్ వినియోగం వల్ల లక్షలాది మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. వ్యాయమం చేయడం, ఊబకాయాన్ని నివారించడం, జీవన శైలి మార్పులు ద్వారా క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చు. భారత ప్రభుత్వ పథకం ఆయుష్మాన్ భారత్, రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ పథకంతో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారందరికీ క్యాన్సర్ సంరక్షణను అందిస్తున్నారు. లంగ్ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భసంచి ముఖ ద్వార క్యాన్సర్‌ను నయం చేయవచ్చు. తొలి దశలో గుర్తిస్తే ఎలాంటి క్యాన్సర్ అయినా నివారించవచ్చు. క్యాన్సర్ సోకిందని భయపడాల్సిన అవసరం లేదు. సకాలంలో గుర్తించి మందులు వాడి ఎంతో మంది క్యాన్సర్‌ను జయించారు.

– డాక్టర్ బెల్లాల రవిశంకర్, మేనేజింగ్ డైరెక్టర్, ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి



భగవద్గీతలో మానవ జీవన సారాంశం

బాలభాను పాఠశాలలో విదేశీయుల సందడి

మురళీనగర్ : భగవద్గీతలో మానవ జీవన సారాంశం ఇమిడి ఉందని పలువురు విదేశీయులు పేర్కొన్నారు. స్థానిక బాలభాను పాఠశాల విద్యార్థులతో కలిసి భగవద్గీత శ్లోకాలు పఠించారు. నగరంలో నిర్వహించనున్న గురు పూజోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన విదేశీయులు మురళీనగర్ సెక్టార్ - 8లోని బాలభాను విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. స్పెయిన్, అర్జెంటీనా, అమెరికా, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియాకు చెందిన 30 మంది ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్న గురుపూజోత్సవంలో పాల్గొనేందుకు విశాఖ నగరానికి వచ్చారు. ఈ మేరకు వీరు బాలభాను పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వారి భవిష్యత్ లక్ష్యాలు అడిగి తెలుసుకున్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. భారతీయ సమాజంలోని గొప్పతనాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. భారతీయుల ఆచార వ్యవహారాలంటే తమకు ఎంతో ఇష్టమన్నారు. బాలభాను విద్యాలయం కరస్పాండెంట్ బీఆర్ కే రాజు, జగద్గురు పీఠం భౌగోళిక చైర్మన్ కె.గురు ప్రసాద్, పాఠశాల డైరెక్టర్ వి.పార్వతి, పి.రవి శంకర్, ప్రిన్సిపాల్ ఎస్‌వీ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, వ్యాయామ సంచాలకుడు సీహెచ్ రమణారావుతో వీరు ఆధ్యాత్మిక అంశాలు, విద్యా బోధన తదితర అంశాలపై చర్చించారు.



బాలభాను పాఠశాలను సందర్శించిన విదేశీయులు

గాజువాక ఎన్ఏసీలో జాబ్ మేళా రేపు

మురళీనగర్ : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో గాజువాక (పెదగంట్యాడ) ఎన్ఏసీ కేంద్రంలో 9న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో నిపునా ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్, హెటిరో లాబ్స్, యాక్సిస్ బ్యాంక్ (క్వెస్ కార్ప్), డీమార్ట్ పాల్గొంటాయని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ ఎలక్ట్రీషియన్, డిప్లమో ఎలక్ట్రికల్, బీఎస్‌సీ కెమిస్ట్రీ, కంప్యూటర్స్, బీకామ్ కంప్యూటర్స్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, నక్కపల్లిలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, మరిన్ని వివరాలకు 79810 22453లో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, స్పాట్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ నంబర్, ఆధార్ అనుసంధానమైన ఫోన్ నంబర్ తీసుకురావాలని ఆయన సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూ కాలనీలో గల జీవీఎంసీ హైస్కూల్, కేఎస్ఎం గర్ల్స్ హైస్కూల్‌లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విశాఖపట్నం సెక్రటరీ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు వివరించారు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి.సన్యాసిరావు, కె.రాము, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి వెంకటశేషమ్మ

ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలుకుదాం

సీతంపేట : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతం చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సీతంపేటలో గల జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరానికి విచ్చేస్తున్న ప్రధాని సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. రానున్న రోజుల్లో పార్టీ కోసం శ్రమిస్తున్న ప్రతి మహిళకు గుర్తింపు లభించేలా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, మహిళా కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

గోవింద మాలధారులకు ఇరుముడి

కంచరపాలెం : జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గోవింద మాలధారులు తిరుమలకు పయనమయ్యారు. అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, పద్మావతి, అలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గోవింద మాలధారులకు ఇరుముడి కట్టారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



గోవింద మాలధారులకు ఇరుముడి కడుతున్న అర్చకులు